క్లుప్తంగా

క్యాన్సర్ స్క్రీనింగ్ సద్వినియోగం చేసుకోవాలి



స్క్రీనింగ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ గిరీషా

సదుం: క్యాన్సర్ స్క్రీనింగ్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా కోరారు. చెరుకువారిపల్లెలో ఆదివారం వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న స్క్రీనింగ్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలో 18–59 ఏళ్ల మధ్య వయసున్న అందరికీ శిక్షణ పొందిన సిబ్బంది ఇంటి వద్దే స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ అనుమానితులను మెడికలాఫీసర్‌కు రెఫర్ చేస్తారని తెలియజేశారు. అక్కడ వ్యాధి లక్షణాలను గుర్తిస్తే, పరీక్షలు నిర్వహించి చికిత్స పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి నయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ చరణ్, ఉదయభాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమం

పుంగనూరు: పట్టణ సమీపంలోని పటాలమ్మ ఆలయంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కలశారాధన, గణపతిహోమం, నవగ్రహ హోమాలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఔట్ సోర్సింగ్ డివిజన్ కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న బాలు

పలమనేరు: పలమనేరు డివిజన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ప్రశాంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జనార్ధన్, ఉపాధ్యక్షులుగా హరికృష్ణ, కోశాధికారిగా కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ప్రసాద్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎంపికచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు బాలు మాట్లాడుతూ, తమకు టైం స్కేల్‌ను వర్తింపజేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జ్ఞానశేఖర్, వివిధ శాఖలకు చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుప్పంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్



ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫ్రాన్స్ దేశస్తుడు, దయానిధి

కుప్పం: ప్రముఖ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను తమ కళాశాల ప్రాంగణంలో ప్రారంభిస్తున్నట్లు స్థానిక ఐఆర్‌ఎం చైర్మన్ దయానిధి తెలిపారు. 2026 నూతన విద్యా సంవత్సరానికి పూర్తి స్థాయిలో ప్రారంభానికి సిద్ధం అవుతుందని, ఇంటర్నేషనల్ కరికులం, సీబీఎస్‌సీ, కార్యచరణ ఆధారిత సిలబస్ ఉంటుందని ఆయన చెప్పారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫ్రాంక్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

సీఎం ఇలాకా రూటే వేరు

అక్రమ లేఔట్లలో సీసీ రోడ్లు..!

ప్రజలకు ఉపయోగపడే పథకాలకు నిధులు లేవని బీద అరుపులు అరుస్తున్న పాలకులు తమ వారి సోకులకు మాత్రం ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెడుతున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనను పక్కన పెట్టి మరీ తమ నాయకుల అక్రమ లేఔట్లలో స్థలాల విలువను పెంచేందుకు ప్రజాధనంతో సిమెంటు రోడ్లు వేస్తుండటం గమనార్హం! దేశంలోనే కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా నిలుపుతామని గొప్పలు చెబుతున్న అధికార పార్టీ నాయకులు చేతల్లో మాత్రం తమ రూటే సెపరేటని చాటుతున్నారు.



లేఔట్‌లో వేస్తున్న సిమెంటు రోడ్డు

- ప్రభుత్వ సొమ్ముతో పచ్చనేతల దందా
- తమ సైట్లకు విలువ పెంచుకునే ఎత్తుగడ
- గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

శాంతిపురం: మండలంలోని 30 సొన్నేగానిపల్లె పంచాయతీలోని కుతేగానిపల్లె క్రాస్ వద్ద పదేళ్ల క్రితం రియల్ వ్యాపారులు ఓ ప్రైవేటు లేఔట్‌ను వేశారు. అప్పట్లో టీడీపీ నాయకులు కొందరు ఒక్కొకరు ఐదుకు పైగా సైట్లను ఇందులో కొనుగోలు చేశారు. పదేళ్లు గడిచినా తమ సైట్లకు ఆశించని ధర రాకపోవడంతో ఒకింత నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మళ్లీ రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావటం, ఇటీవల పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీలో సీసీ రోడ్ల పనులు కేటాయించడంతో వాటిపై దృష్టి సారించారు. కొన్ని గ్రామాల్లో సిమెంటు రోడ్ల అవసరం ఉన్నా పట్టించుకోకుండా ఒక టింబర్ వ్యాపారి షెడ్డు మాత్రమే ఉన్న లేఔట్‌పై ఎనలేని ప్రేమ కనబరిచారు. రూ 9.90 లక్షలతో తమకు కావాల్సిన సిమెంటు రోడ్లను మంజూరు చేసుకున్నారు. ఈ పనులపై నాయనపల్లెకు చెందిన కొందరు టీడీపీ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పెడచెవిన పెట్టారు. తమ సైట్ల విలువను పెంచుకోవడమే లక్ష్యంగా సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేశారు.

వారెవ్వా..! ఏం అతి తెలివో.. !

ఏడాది క్రితం ఓ టింబర్ వ్యాపారి ఇదే లేఔట్‌లో నిర్మించుకున్న షెడ్డుకు విద్యుత్ సరఫరా కోసం లైన్ల ఏర్పాటుకు కూడా పంచాయతీ అంగీకరించకపోవడంతో సొంత సొమ్ముతో ఆ పని చేసుకున్నారు. కానీ ఇప్పుడు ఆ ప్రాంతంలో ఖాళీ సైట్లకు సీసీ రోడ్ల నిర్మాణం వివాదాస్పదం కావడంతో పనులు ప్రారంభానికి ముందుగా గత నెలాఖరులో సదరు వ్యాపారి నుంచి అత్యవసరంగా షెడ్డుకు పన్నులు కట్టించుకుని క్రమబద్ధీకరణ చేయడం విశేషం! దీనినే సాకుగా చూపుతూ పన్నులు కట్టిన వారికి సిమెంటు రోడ్లు వేస్తున్నామనే వాదనను తెరపైకి తెచ్చారు. వాస్తవానికి ఈ లేఔట్‌లో ఇప్పటి వరకూ మూడు నిర్మాణాలు ఉండగా, వాటిలో ఒకటి జాతీయ రహదారి పక్కన, మరొకటి సొన్నేగానిపల్లె రోడ్డు పక్కన ఉన్నాయి. ఒక్క టింబర్ సేల్స్ షెడ్డు మాత్రమే లేఔట్‌లో ఓ మూలన ఉంది.

పట్టించుకోని అధికారులు

తమ గ్రామంలో సిమెంటు రోడ్లు లేక అవస్థలు పడుతోంటే అక్రమ లేఔట్‌లో సిమెంటు రోడ్లు వేసేందుకు పూనుకున్నారని నాయనపల్లె గ్రామస్తులు ఈ నెల 4న ఎంపీడీఓ, పంచాయతీ రాజ్ డీఈ, సొన్నేగానిపల్లె సచివాలయ అధికారులు, టీడీపీ మండల నాయకులకు ఫిర్యాదు చేశారు. కానీ దీనిపై ఆయా అధికారులు, నాయకులు స్పందించకపోగా శనివారం సిమెంటు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వితంతువుల కుటుంబ పెన్షన్‌పై వివరణ ఉత్తర్వులు జారీ

పలమనేరు: వితంతువులు, విడాకులు పొందిన కుమార్తెల కుటుంబ పెన్షన్ పొందు అర్హతపై ఖజానాశాఖ సంచాలకులు వివరణాత్మక ఉత్తర్వులను జారీ చేశారని పెన్షనర్ల అసోసియేషన్ నేత సోమచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్: 315లో కొన్ని అనుమానాలను ఖజానాశాఖ లేవనెత్తిందని, దీనిపై ప్రభుత్వం తాజాగా పూర్తి వివరణతో జీవోను జారీ చేసిందని, ఓ ఉద్యోగి ఉద్యోగ విరమణ ముందుగానీ తర్వాతగానీ ఆ కుటుంబంలో వితంతువైన కుమార్తె లేదా విడాకులు పొందిన కుమార్తె ఫ్యామిలీ పింఛనుకు అర్హురాలిగా అందులో స్పష్టంగా పేర్కొన్నారని తెలియజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మురళి

బైరెడ్డిపల్లె: చెన్నై శంకర్‌నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 40 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 20 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ నేత్రాలయ ఆసుపత్రిలో నైపుణ్యం కలిగిన వైద్యాధికారులతో శస్త్ర చికిత్స చేయిస్తామని, వారికి ఉచిత ప్రయాణం, భోజనం, వసతి కల్పిస్తామని, మందులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళి, కృష్ణ, శ్రీనివాసులు, నిర్వాహకులు చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురురాజారావు

పలమనేరు: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గురురాజారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ అందేలా చూడాలన్నారు. పెన్షనర్లకు డీఏ, డీఆర్ బకాయిలను చెల్లించాలన్నారు. కొందరు పెండింగ్ బకాయిలు పొందకనే మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారి వారసులు ఇప్పటికీ వీటికోసం ఎదురు చూస్తున్నారని, ఇకనైనా ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన నాయకులు కృష్ణమూర్తి, గౌస్, వీరభద్రగౌడు, బాలసుబ్రమణ్యం, సులోచన, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: ఆంగ్లేయుడైనప్పటికీ తెలుగుభాషకు, సాహిత్యానికి సీపీ బ్రౌన్ ఎనలేని సేవలు అందించి తెలుగు భాషోద్ధారకుడిగా పేరు గడించారని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు కీర్తించారు. ఆదివాం స్థానిక కళామందిరంలో సీపీ బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తెలుగు సాహిత్యాన్ని క్రోడీకరించి, తన సొంత డబ్బుతో తాళపత్రాల్లోకి ఎక్కించి జన బాహుళ్యంలోకి తెచ్చారన్నారు. తెలుగు వారి అపురూప సంపదగా భావించే వేమన పద్యసంపద ఆయన కృషి వలనే తెలుగువారికి చేరువ చేవారన్నారు. అంతేకాకుండా వేమన నీతిపద్యాలను ఆంగ్లంలోకి తర్జుమా చేసి వాటిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. నాడు సీపీ బ్రౌన్ వీటిపై దృష్టి సారించకుండా పోయింటే నేడు ఎన్నో గ్రంథాలు మనకు లభ్యమయ్యేవి కావన్నారు. సీపీ బ్రౌన్ నిఘంటువును ఇప్పటికీ మనం ప్రామాణికంగా వాడుతున్నామంటే అది ఆయన గొప్పతనమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, చంద్రశేఖరయ్య, సయ్యద్ మొహిద్దీన్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి



అన్నదానం చేస్తున్న నౌ జవాన్ కమిటీ సభ్యులు

పుంగనూరు: పట్టణంలో టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన నౌ జవాన్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. తొలుత టిప్పుసుల్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జవహర్, ఇర్ఫాన్, ఇమ్రాన్, మున్నా, షావలి, తబషీర్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం 20 వినతులు



వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సదుం: మండలంలో ఓటర్ల జాబితా సవరణ, ఓటు హక్కు నమోదుకు రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, డీటీ కుమార్ ఆదివారం తెలిపారు. ఓటర్ల నమోదుకు (ఫారం-6) 20, డిలిటేషన్‌కు (ఫారం-7) 12, మార్పులు- చేర్పులకు (ఫారం -8) 15 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. 34 పోలింగ్ కేంద్రాల పరిధిలో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

జనవరి 5న హైందవ శంఖారావం



విడుదల చేస్తున్న నేతలు

పుంగనూరు: విజయవాడలో జనవరి 5న హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు వరదారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యంతో కలసి పోస్టర్లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. శంఖారావానికి అధిక సంఖ్యలో హిందూవులు తరలిరావాలన్నారు. అన్ని వర్గాల ప్రజలతో నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసి, హిందూవుల సత్తా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ ప్రభాకర్, హిందూ సంఘాల ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, మఠంబాబు, నరసింహులు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధిమాంద్యం పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరం



పిల్లలకు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న జడ్జి పద్మజ

గంగవరం: మండలంలోని నడింపల్లె వద్ద రిమ్మర్స్ స్కూల్‌లో బుద్ధిమాంద్యం పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని న్యాయసేవా సంస్థ ఆదివారం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా చిత్తూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి/జిల్లా న్యాయసేవా అధికార సంస్థ సెక్రటరీ పద్మజ హాజరయ్యారు. పాఠశాలలో పిల్లల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. వారి ఆరోగ్య క్షేమాల గురించి పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వినికిడి, ఆర్థో, ఇతర వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చికిత్స అవసరమైన కొంతమంది పిల్లలను చిత్తూరుకు రెఫర్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కోర్టు, పాఠశాల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



41 ఏళ్ల తర్వాత కలుసుకున్న రొంపిచెర్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

రొంపిచెర్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1983–84లో పదవి తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలిసి సందడి చేశారు. పరస్పరం పలకరింపులు, యోగక్షేమాలతో జ్ఞాపకాల పూదోటలో విహరించారు. తమ ఉన్నతికి బాటలు వేసి అప్పటి గురుదేవులు పి.రామచంద్రారెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, మోహన్‌గుప్తను శాలువలు, పూల మాలలు వేసి సన్మానించి ఆశీస్సులు పొందారు. తమ బ్యాచ్‌లో ఎవరైనా ఆర్థిక సమస్యలు, అనారోగ్యంతో సతమతమవుతున్న సహచరులకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజమోహన్‌రెడ్డి, మునిరెడ్డి, ఆర్వీ. జయప్రకాష్, శేఖర్, బాలాజి, శ్రీరాములరెడ్డి, రామయ్యనాయుడు, సలీంబాషా, ఈశ్వరయ్య, రాజారెడ్డి, దామోదర్, మునిరెడ్డి, మంజుల, అనిత, సునీత, మధురవాణి, అనూరాధ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దీపారాధనతో జీవితంలో వెలుగులు



ప్రభోదానంద రచనలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కుప్పం రూరల్: దీపారాధన చేస్తే భగవంతుని రాజ్యం మొదలవుతుందని ప్రభోదానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వడ్డిపల్లె, బేవనపల్లెలో ప్రభోదానంద రచనలపై ప్రచారం చేశారు. కార్తీక మాసంలో దేవాలయాల్లో ప్రతి ఒక్కరూ దీపాలు వెలిగిస్తే వారి జీవితం వెలుగులమయం అవుతుందని, ఇదే విషయాన్ని ‘దేవాలయాల రహస్యాలు’ అనే పుస్తకంలో ప్రబోధానంద చాటిచెప్పారని పేర్కొన్నారు. అనంతరం ఈ గ్రామాల్లో ప్రభోదానంద రచనలను గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, నాగరాజు, చందు, శరవణ, దేవరాజు, రంగప్ప, ఇందిర, విమల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

వి.కోట మండలంలో..

వి.కోట: కార్తీక మాసంలో దీపారాధన చేయడం చాలా విశిష్టతతో కూడుకున్నదని, దీపారాధన అందరూ చేయాలని మండల ప్రభోద సేవాసమితి అధ్యక్షుడు అశోక్‌బాబు కోరారు. ఆదివారం మండలంలోని ఆళ్వార్‌పల్లె, చిన్నాగనపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ, కార్తీక మాసం డిసెంబర్ 1వ తేదీ వరకు ఉంటుందని అందరూ దీపారాధన చేసి యోగ సాధనలు చేయడానికి గుర్తుగా దీపం వెలిగించాలన్నారు. అనంతరం కార్తీక మాసం విశిష్టతను వివరిస్తూ రాసిన పుస్తకాలను, బుక్‌లెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు హరి, గౌతమ్, కృష్ణ, సంతోష్‌కుమార్, విజయ్, ఝాన్సీ పాల్గొన్నారు.

మా మంచి మాస్టారు



పత్తికొండ జెడ్పీ హైస్కూల్‌లో దాతల సహకారంతో నీటి బోరు వేయించిన హెచ్‌ఎం శ్రీధర్‌బాబు (ఫైల్)

ఆది నుంచీ విద్యలో గురువుకు ఉత్కృష్టమైన స్థానం ఉంది. అందుకే ‘గురుఃబ్రహ్మ..గురుర్విష్ణు..గురుదేవో మహేశ్వర..గురు సాక్షాత్ పరబ్రహ్మ..’అనే వాక్కు గురువుకు ఉన్న విశిష్టత, ప్రాధాన్యతను చాటిచెప్పింది. ఆ స్థాయిని తమ సేవలతో అందుకున్న వారు కొందరే ఉంటారు. ఆ కోవలోకి చెప్పుకోదగిన వారు శ్రీధర్‌బాబు ఒకరు. ఈయన మండలంలోని మేలుమాయి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. మా మంచి మాస్టారు అని గుర్తింపు తెచ్చుకున్నారు. విద్యారంగంలో ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం పురస్కారం ప్రకటించింది. సోమవారం ఆయన సీఎం చేతుల మీదుగా అవార్డు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- ఉత్తమ హెచ్‌ఎంగా శ్రీధర్‌బాబు ఎంపిక
- లక్షల విరాళాలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి
- విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు
- నేడు సీఎం చేతుల మీదుగా అవార్డు ప్రదానం

గంగవరం: 1988లో తొలుత వి.కోట మండలం దానమయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఆయన ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత వివిధ స్కూళ్లలో పనిచేశారు. 2009–2015 మధ్య కాలంలో బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్ల జెడ్పీ హైస్కూల్‌కు ఉద్యోగోన్నతిపై హెచ్‌ఎంగా వెళ్లారు. ఆ తర్వాతమండలంలోని పత్తికొండ జెడ్పీ హైస్కూల్‌లో పనిచేశారు. ప్రస్తుతం మేలుమాయి జెడ్పీ హైస్కూల్‌కు విధులు నిర్వర్తిస్తున్నారు. ఏ స్కూల్‌లో పనిచేసినా విద్యార్థులకు అభ్యున్నతికి, స్కూళ్ల అభివృద్ధికి ఆయన ఇతోధికంగా కృషి చేస్తారనే పేరు తెచ్చుకున్నారు.

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధికి కృషి

బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్ల జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్నప్పుడు దాతల సహకారంతో రూ.10 లక్షలతో పాఠశాల అభివృద్ధికి తోడ్పడ్డారు. పత్తికొండ జెడ్పీ హైస్కూల్‌లో దాదాపు రూ.80 లక్షల విరాళాలతో ఎంతగానో అభివృద్ధి చేశారు. జాయినింగ్ ద డాట్స్ సంస్థ సహకారంతో రూ.8 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.5 లక్షలతో గ్రంథాలయ పుస్తకాలు, రూ.8 లక్షలతో బాస్కెట్ బాల్ కోర్టు, రూ.10 లక్షలతో పాఠశాలోనే చిల్డ్రన్స్ పార్క్, రూ.10 లక్షలతో క్రీడామైదానం అభివృద్ధి, రూ.5లక్షలతో అధునాతన మరుగుదొడ్డి నిర్మాణం, రూ.15 లక్షలతో 2 తరగతి గదులు, 1 నీటి బోరు వసతి, షరాబు జయన్న సహకారంతో పాఠశాలకు బీరువాలు, పలమనేరు వాస్తవ్యులు శేగు రాజన్న కుటుంబీకుల సహకారంతో రూ.5 లక్షలతో ఒక తరగతి గది నిర్మించారు. అప్పటి ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలతో కాంపౌండ్ వాల్, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఫర్ చేంజ్ సంస్థ, సాయి చైతన్య హైదరాబాద్ సహకారంతో ఏటా రూ.50 వేల విలువగల పుస్తకాలను విద్యార్థులకు అందించడంలో కృషి చేశారు. జెటిడి సంస్థ సహకారంతో లక్షల వ్యయంతో విద్యార్థులకు విజ్ఞానయాత్రలు, విహారయాత్రలు నిర్వహించారు. క్రీడాకారులు, సంగీతం, భరతనాట్యం, కంప్యూటర్ విద్యను అందించారు. ప్రస్తుతం మేలుమాయి ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో పాఠశాలకు అవసరమైన కుర్చీలు, ఇన్వర్టర్ సమకూర్చారు. మన బడి - మన భవిష్యత్ కార్యక్రమంలో ఆగిపోయిన పనులను అమెరికాలో స్థిరపడిన శిష్యుడు కళ్యాణచక్రవర్తి ద్వారా రూ.3 లక్షలతో కొంతవరకూ పూర్తి చేయించారు.

సేవలకు ఎన్నో అవార్డులు

201లో జిల్లా ఉత్తమ కాంప్లెక్స్ ఉపాధ్యాయుడిగా, 2016లో జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా, 2017, 2018, 2019లో జిల్లా ఉత్తమ హెచ్‌ఎం అవార్డులు అందుకున్నారు. అలాగే, 2022 సెప్టెంబర్‌లో గురు పూజోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్నీ అందుకున్నారు. 3 దశాబ్దాలుగా ఆయన విద్యారంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా సోమవారం విజయవాడలో సీఎం చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకోనుండడంతో పలువురు అభినందించారు.





పాఠశాలలో దాతలతో సరస్వతి ఆలయాన్ని నిర్మించిన హెచ్‌ఎం, అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న చేతులు మీదుగా ప్రశంసా ప్రతాన్ని అందుకుంటున్న దృశ్యం (ఫైల్)



రొంపిచెర్లలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

మాదిగల సత్తా చాటుదాం

రొంపిచెర్ల: కులగణనలో మాదిగల సత్తా చాటి చెప్పాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ ఎన్నో పోరాటాలు చేసి ఎస్సీ వర్గీకరణకు కోర్టు నుంచి అనుమతి వచ్చేలా కృషి చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కులగణనకు పూనుకుందని, ఇందులో మాదిగలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 14న మదనపల్లెలో చౌడేశ్వరిదేవి కళ్యాణ మండపంలో మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తామని, మాదిగలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు శివయ్య, రఘునాథ్, గిరిబాబు, రామాంజునేయులు, రవి, రమేష్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.